RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న

జన సంఘర్షణ దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు,

నియోజకవర్గ ఆర్.సి.ఐ, మండల స్థాయి విలేకర్లుగా

పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన

యువతి యువకులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9550558911-6305026524



| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 36 Vol: 36 | ఫిబ్రవరి 22 ఆదివారం 2026 February 22 Sunday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|



## స్వామివారి దర్శనానికి 20 గంటల నిరీక్షణ



**తిరుమల, ఫిబ్రవరి 21 జనసంఘర్షణ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వారాంతం కావడం, సెలవు దినం తోడవడంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి. శనివారం నాటి రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు కేటాయించే సర్వదర్శనం కోసం వేచి ఉండే సమయం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు ఏకంగా 18 నుంచి 20 గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోవడంతో, క్యూలైన్లు వెలుపలికి వచ్చి శిలాతోరణం వరకు కిలోమీటర్ల మేర విస్తరించాయి. గడిచిన శుక్రవారం ఒక్కరోజే తిరుమల క్షేత్రాన్ని 68,156 మంది భక్తులు దర్శించుకోగా, 28,295 మంది

➢ మిగతా 2వ పేజీలో..

## కష్టపడితేనే పదవులు

### డీసీసీ అధ్యక్షుల శిక్షణలో సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



**వికారాబాద్, ఫిబ్రవరి 21 జనసంఘర్షణ:** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికే పదవులు వరిస్తాయని, పార్టీలో కేవలం 'మెరిట్ లిస్ట్' ప్రకారమే అవకాశాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని, గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని గుర్తుచేశారు. డీసీసీ అధ్యక్ష పదవి అనేది నాయకులుగా ఎదిగేందుకు తొలిమెట్టు వంటిదని, వచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారు భవిష్యత్తులో పీసీసీ అధ్యక్షులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, చివరికి ముఖ్యమంత్రులుగా కూడా ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని హెచ్చరించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమని, అయితే వాటిని వెల్లడించే స్వేచ్ఛ కాంగ్రెస్‌లో మొదటి నుంచీ ఉందని సీఎం తెలిపారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వేధించే సంస్కృతి తమ పార్టీలో లేదని, కానీ మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం శ్రమించే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసిన వారమవుతామని హితవు పలికారు. నాయకుల ప్రతి కదలికను పార్టీ నిరంతరం గమనిస్తుందని, మెరిట్

➢ మిగతా 2వ పేజీలో..

## కామారెడ్డిలో రాజకీయ రణరంగం

### ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద ఇరువర్గాల ఘర్షణ

**కామారెడ్డి, ఫిబ్రవరి 21:** కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాజకీయ సెగలు చెలరేగాయి. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించడంతో

➢ మిగతా 2వ పేజీలో..

## దేశ రాజధానిలో ఉగ్ర కుట్ర

### ఆలయాలే లక్ష్యంగా లష్కరే తయిబా స్కెచ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 జనసంఘర్షణ:** దేశ రాజధాని దిల్లీలో మరోసారి రక్తపాతం సృష్టించేందుకు పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా (ఎల్‌ఈటీ) భయంకరమైన కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేయడంతో దిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా దిల్లీలోని చారిత్రక ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు వ్యూహం పన్నినట్లు సమాచారం అందింది. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక ప్రసిద్ధ దేవాలయంపై ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్)తో దాడి చేసేందుకు ఉగ్రవాదులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు నిఘా వర్గాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గత ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలను దెబ్బతీయాలని లష్కరే కుట్ర పన్నుతోంది. ఈ ముప్పు కేవలం దిల్లీకే పరిమితం కాకుండా, దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్

➢ మిగతా 2వ పేజీలో..

## భగ్గుమంటున్న పసిడి

- మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు..
- వినియోగదారుల్లో ఆందోళన



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 జనసంఘర్షణ:** దేశంలో బంగారం ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం ఒక్కసారిగా పుంజుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావంతో దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ. 1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో ఎక్కువగా వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,44,260గా ఉంది. శుక్రవారంతో పోలిస్తే ఈరోజు 24 క్యారెట్ల బంగారంపై రూ. 880, 22 క్యారెట్లపై

➢ మిగతా 2వ పేజీలో..

## ప్రయాణ ప్రాకారంలో సరికొత్త విప్లవం

### ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్ ప్రారంభం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 జనసంఘర్షణ:** దేశ రాజధాని ఢిల్లీ మరియు పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ రవాణా రంగంలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఢిల్లీ నుంచి మీరట్‌కు ప్రయాణ

➢ మిగతా 2వ పేజీలో..

## ఐదేళ్లలో ఏరేస్తాం

### చొరబాటుదారులకు వార్నింగ్ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా

**గౌహతి, ఫిబ్రవరి 21 జనసంఘర్షణ** దేశం నుంచి నక్సలిజం ఏ విధంగానైతే అంతమవుతోందో, అదే రీతిలో చొరబాటుదారులను కూడా పూర్తిగా ఏరివేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అక్రమ వలసదారులను కేవలం

➢ మిగతా 2వ పేజీలో..



# కష్టపడితేనే పదవులు

**మొదటిపేజీ తరువాయి..** ' కోటాలో రాణిస్తేనే పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. నెహ్రూ కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను స్మరిస్తూ, రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి కూడా పాదయాత్ర ద్వారా ప్రజల మధ్యే గడిపారని గుర్తుచేశారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలతో నిరంతరం అనుసంధానమై ఉండాలని డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై ముఖ్యమంత్రి ప్రశంసల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం ఉన్నప్పటికీ ఆమె సుఖాలను కోరుకోకుండా, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పునరుజ్జీవం కోసం ముళ్లబాటలో ప్రయాణిస్తున్నారని కొనియాడారు. షర్మిల చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును పెంచేందుకు ఆమె పడుతున్న శ్రమ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులకు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి పార్టీని బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# స్వామివారి దర్శనానికి 20 గంటల నిరీక్షణ

**మొదటిపేజీ తరువాయి..** భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ. 3.46 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవుల దృష్ట్యా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ పక్కా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. వేసవిలో వచ్చే యాత్రికులకు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. గత కొన్ని సంవత్సరాల డేటాను విశ్లేషించి, భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన సమయాలను నియంత్రించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాడ వీధులు, క్యూలైన్లు ఉండే ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్ వేయడంతో పాటు, అదనపు షెడ్లను నిర్మించనున్నారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కేంద్రాలను పెంచుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఈసారి సాంకేతికతకు పెద్దపీట వేస్తూ, 'ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్' ద్వారా భక్తుల రాకపోకలను ప్రతి నిమిషం పర్యవేక్షించనున్నారు. దీనివల్ల క్యూలైన్లలో భక్తులు ఎంత సమయం వేచి ఉన్నారో తెలుసుకుని, తదనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది. గత జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి, గత ఏడాది జూన్‌లో 82 వేల మందికి పైగా దర్శనం కల్పించామని, అదే స్ఫూర్తితో ఈ వేసవిలోనూ సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కలిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో స్పష్టం చేశారు.

# భగ్గుమంటున్న పసిడి

**మొదటిపేజీ తరువాయి..** రూ. 800 మేర ధరలు పెరగడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇదే ధోరణి కనిపిస్తుండగా, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ. 1,57,520కి చేరగా, ముంబైలో రూ. 1,57,370 మరియు చెన్నైలో రూ. 1,57,300గా నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ తీసుకునే కీలక నిర్ణయాలు, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ విలువలో వస్తున్న మార్పులు బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటికి తోడు ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం మరియు ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు తమ పెట్టుబడులకు బంగారాన్ని అత్యంత సురక్షితమైన మార్గంగా భావిస్తున్నారు. ఈ పరిణామాల వల్ల పసిడికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగి, ధరలు పైపైకి వెళ్తున్నాయి. సామాన్య వినియోగదారులపై, ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం తీవ్రంగా పడనుంది. మునుపటి రోజుల్లో ధరలు కాస్త తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న సామాన్యులకు, తాజా పెరుగుదల షాక్ ఇచ్చింది. వెండి ధరలు కూడా ఇదే బాటలో సాగుతూ కిలోకు రూ. 2,70,000 మార్కును దాటడం విశేషం. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్లో అనిశ్చితి కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. పసిడి ప్రియులు ధరలు ఎప్పుడు తగ్గుతాయా అని ఎదురుచూస్తున్న తరుణంలో, ఈ నిరంతర పెరుగుదల కొనుగోలుదారులను వెనక్కి తగ్గేలా చేస్తోంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకులు సర్దుమణిగే వరకు ఈ అస్థిరత కొనసాగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## నోటీసులు ధిక్కరించి ర్యాలీ

### అంబటి, జక్కంపూడిలపై కేసు నమోదు

**గుంటూరు, ఫిబ్రవరి21 :** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 8 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు.

# ఐదేళ్లలో ఏరేస్తాం

**మొదటిపేజీ తరువాయి..** ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే కాకుండా, దేశం నుంచే వెళ్లగొడతామని ఆయన హెచ్చరించారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శనివారం అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తుండటం విశేషమని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆక్రమిత స్థలాల నుంచి వారిని తరిమికొట్టినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని, వారు మరో చోట స్థిరపడే అవకాశం ఉన్నందున వారిని మొత్తంగా దేశ సరిహద్దుల వెలుపలికి పంపించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో రాహుల్ గాంధీ అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని చెప్పినప్పటికీ, ఆ పనిని కాంగ్రెస్ ఎప్పటికీ చేయలేదని ఆరోపించారు. చొరబాటుదారులే కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ఓటు బ్యాంకు అని, వారిని రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అస్సాం భద్రతకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ చొరబాటుదారులపై చర్యలు తీసుకోవడానికి కాంగ్రెస్ నిజంగా కట్టుబడి ఉంటే, ఆ విషయాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టంగా పొందుపర్చాలని ఆయన సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతదేశంలో అస్సాం రాష్ట్రం ఒక గొప్ప పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో హోంమంత్రి పాల్గొన్నారు. శౌర్య పరాక్రమాలకు, దేశభక్తికి సీఆర్పీఎఫ్ దళాలు నిలువెత్తు నిదర్శనమని, దేశ రక్షణలో వారి సేవలు అజరామరమని కొనియాడారు. అంతర్గత భద్రతను కాపాడటంలో సీఆర్పీఎఫ్ జవాన్లు పోషిస్తున్న పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ సరిహద్దులను, ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేయబోదని, అక్రమ వలసల నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# దేశ రాజధానిలో ఉగ్ర కుట్ర

**మొదటిపేజీ తరువాయి..** 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘోర కలికానికి సంబంధించిన దర్యాప్తు ఇంకా కొనసాగుతుండగానే, మళ్లీ అదే ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందన్న వార్తలు దేశ రాజధానిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఉగ్రవాదులు జనసమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని భారీ విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి.

దీంతో దిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన కూడళ్లు, మతపరమైన ప్రదేశాలు, విమానాశ్రయాలు మరియు రైల్వే స్టేషన్ల వద్ద అదనపు బలగాలను మోహరించారు. అనుమానిత వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సరిహద్దుల వద్ద కూడా నిఘాను పెంచి, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఉగ్రవాదుల కుట్రలను భగ్నం చేసేందుకు ఎన్‌ఎస్జీ కమాండోలు, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారు. రాబోయే రోజుల్లో పండుగలు, ఇతర కార్యక్రమాలు ఉన్న నేపథ్యంలో భద్రతా దళాలు సర్వసన్నద్ధంగా ఉండాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

# ప్రయాణ ప్రాకారంలో సరికొత్త విప్లవం

**మొదటిపేజీ తరువాయి.** సమయాన్ని గణనీయంగా తగ్గించే 82 కిలోమీటర్ల పొడవైన 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం జాతికి అంకితం చేశారు. మీరట్‌లో పర్యటించిన ప్రధాని, సుమారు రూ. 12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 'మీరట్ మెట్రో' సేవలను కూడా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి ప్రయాణికులను పలకరించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు గతంలో పట్టే మూడు గంటల ప్రయాణ సమయం ఇప్పుడు కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఈ ప్రాజెక్టు భారతీయ రవాణా వ్యవస్థలో అనేక రికార్డులను సృష్టించింది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా గుర్తింపు పొందింది. అంతేకాకుండా, ప్రపంచ స్థాయి సాంకేతికతతో ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్) మరియు లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ సమన్వయ వ్యవస్థ పట్టణ రవాణాలో ఒక అద్భుత మైలురాయిగా నిలవడమే కాకుండా, ఇతర నగరాలకు ఆదర్శంగా నిలవనుంది. అత్యాధునిక సౌకర్యాలు, పర్యావరణ హితమైన డిజైన్‌తో రూపొందించిన ఈ కారిడార్ ద్వారా రోడ్లపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఈ అభివృద్ధి పనులు కేవలం రవాణా సౌకర్యాలకే పరిమితం కాకుండా, ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడతాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి రావడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, పారిశ్రామికంగా ఈ కారిడార్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మెరుగైన కనెక్టివిటీతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, ఇది నవ భారత ప్రగతికి సంకేతమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో రాజకీయ రణరంగం

**మొదటిపేజీ తరువాయి..** తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మధ్య గత కొద్దిరోజులుగా సాగుతున్న భూకబ్జా ఆరోపణల నేపథ్యంలో ఈ వివాదం ముదిరింది. ప్రభుత్వ కాలేజీ, అరోరా కాలేజీ భూములను ఎమ్మెల్యే కబ్జా చేశారన్న ఆరోపణలపై సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసరడంతో, ఇరు పార్టీల నేతలు శిశు మందిర్ వేదికగా బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేయడంతో పాటు కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అయితే, మాజీ సర్పంచ్ గిరెడ్డి మహేందర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ క్యాంప్ ఆఫీస్ ముట్టడికి యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘర్షణ హింసాత్మకంగా మారి, ఆగ్రహానికి గురైన బీజేపీ కార్యకర్తలు మహేందర్‌రెడ్డి కారుపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా కారును రోడ్డుపై బోల్తా పడవేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఈ క్రమంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు వర్గాలు పరస్పరం దాడులకు దిగడంతో కామారెడ్డి పట్టణంలో ఒక్కసారిగా హైటెన్షన్ నెలకొంది.

పరిస్థితి విషమించడంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం పట్టణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా పెట్టామని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఈ ఘటనతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

## యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

- ఉదయం వటపత్రశాయి..రాత్రి హంసవాహనం

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి21 :** శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగారు. బ్రహ్మోత్సవాలు, వారాంతం కావడంతో యాదగిరిగుట్టకు భారీగా భక్తులు తరలివచ్చారు. కాగా, లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు.

## మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

### జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి21 :** మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సా ధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷-దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.


జన సంఘర్షణ



# కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు మధ్య కళాశాల వద్ద కాంగ్రెస్...

కామారెడ్డి: ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)

నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఎమ్మెల్యే సూచన మేరకు కార్యకర్తలు ఎవరూ క్యాంప్ కార్యాలయం వైపు రాలేదు. అయిన క్యాంప్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోసానిపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గీరెడ్డి మహేందర్ రెడ్డి పోలీసుల కళ్లుగప్పి తన కారులో క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి స్టేషన్కు తరలించారు. క్యాంప్ ఆఫీసుకు కాంగ్రెస్ నాయకుడు రావడంపై బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మొదట మహేందర్ రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దాంతో పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. దాంతో షబ్బీర్ అలీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. పోలీసులను తోసుకుంటూ వెళ్లి కారును ఎత్తి పడేశారు. దాంతో స్వల్పంగా లాఠీఛార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. ఏఎస్పీ చైతన్య రెడ్డి క్యాంప్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాసేపటికి పోలీసులు కారును టోచన్ సహాయంతో తరలించేందుకు ప్రయత్నించగా కార్యకర్తలు పోలీసులను అడ్డుకున్నారు. మహేందర్ రెడ్డి ఇక్కడికి రావాలని, క్యాంప్ కార్యాలయానికి ఎందుకు వచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో మరోసారి పోలీసులు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకోగా కొందరు కార్యకర్తలు మహేందర్ రెడ్డి కారుకు నిప్పుపెట్టారు. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు కార్యకర్తలను పక్కకు తరలించి నీళ్లతో మంటలను ఆర్పివేసి కారును తరలించారు. ఈ క్రమంలో ఓ బీజేపీ కార్యకర్తను పోలీసులు అరెస్ట్ చేయగా ఎమ్మెల్యే రమణారెడ్డి బయటకు వచ్చి అరెస్ట్ చేసిన తమ కార్యకర్తను పంపించాలని పోలీసులకు సూచించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పోలీసులను భారీగా మోహరించారు. పోలీసుల కళ్లుగప్పి ఎలా వస్తాడుని బీజేపీ నాయకులు. ఎమ్మెల్యే సూచన మేరకు తాము శాంతియుతంగా ఎలాంటి ఆందోళన చేయకుండా ఉన్నామని బీజేపీ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు పోలీసుల కళ్లుగప్పి క్యాంప్ కార్యాలయానికి ఎలా వస్తాడని ప్రశ్నించారు. ఇది కచ్చితంగా పోలీసుల నిఘా వైఫల్యమేనని ఆరోపించారు. కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ క్యాంప్ కార్యాలయం వద్దకు వచ్చిన మహేందర్ రెడ్డి అనే కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెల్యే ఇచ్చిన పిలుపును స్వాగతించాడని, ఎమ్మెల్యే సూపర్ అంటూ మెసేజ్ చేశాడని తెలిపారు. ఇప్పుడు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం విడ్డురంగా ఉందన్నారు.



# బాన్సువాడ బయలుదేరిన ఎండల లక్ష్మీనారాయణను మధ్యలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బందించిన బిక్కనూరు పోలీసులు

బాన్సువాడ: ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)

బాన్సువాడ పట్టణంలో నిన్న జరిగిన ఘర్షణల నేపథ్యంలో గాయపడిన కార్యకర్తలను , ఒక మతోన్మాది చేతిలో దాడికి గురైన హిందూ యువతిని పరామర్శించేందుకు బాన్సువాడ బయలుదేరిన బిజెపి మాజీ శాసనసభ పక్ష నేత, బాన్స్వాడ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎండల లక్ష్మీనారాయణ ను మార్గమధ్యంలో భిక్కనూరు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముస్లిం అరాచకాలు పెట్రేగిపోయాయని, అడుగడుగునా హిందువులను ఇబ్బందులకు గురి చేస్తూ ముస్లింలు అరాచకాలకు పాల్పడుతున్నారని, పోలీసులు కూడా బాధితుల పక్షాన నిలువకుండా రాజకీయ ఒత్తిడికి తలొగ్గి బాధితులపైనే అక్రమంగా వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రైవేటు వ్యాపార సంస్థలో పూజ చేసిన అనంతరం దేవుడి పాటలు పెట్టినందుకు హిందూ యువతి మీద దుర్భాషలాడుతూ దాడికి పాల్పడటమే దుండగుడిని వెంటనే అరెస్టు చేసి నిర్భయ కేసును ,హత్యాయత్నం కేసును నమోదు చేయాలని, నిందితుడిని అత్యంత కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో బాన్సువాడ నియోజకవర్గ మొత్తం ఎక్కడికక్కడ నిరసనలు పెళ్ళుబుకుతాయని ఆయన పోలీసులను హెచ్చరించారు.



# కామాంధుడి కథ ముగిసింది..

❑ **మరికొందరి పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు..**

వర్ని:ఫిబ్రవరి21( జన సంఘర్షణ)





నిజామాబాద్ జిల్లా వర్ని అదృశ్యం, అత్యాచారం, హత్య ఆపై నిందితుడి ఆత్మహత్య.. మొత్తం 24 గంటల్లోనే అంతా జరిగిపోయింది. కామాంధుడి కథ ముగిసిపోయింది. మదనపల్లి బాలికపై అత్యాచారం కేసులో తక్షణ న్యాయం జరిగింది. హత్య చేసిన నిందితుడు చెరువులో శవమైన తేలగా డెడ్ బాడీని చూసేందుకు కూడా తల్లి రాని పరిస్థితి నెలకొంది. మరోవైపు కులవర్ధన్ స్నేహితులు, తల్లి పాత్రపైనా అనుమానాలు వ్యక్తం అవుతుండటంతో పోలీసుల దర్యాప్తు అన్ని కోణాల్లో కొనసాగుతోంది. అసలు పిక్చర్ ఏంటో తెల్చే పనిలో ఉన్న పోలీసు యంత్రాంగం.. నిన్నటి ఉద్రిక్తతకు దారి తీసిన పరిస్థితులు, కారణాలు, కారకుల కోసం అన్వేషిస్తుంది.

**24 గంటలల్లోనే శవమైన నిందితుడు..**

అన్నమయ్య జిల్లాలో సంచలనం రేకెత్తించిన మైనర్ బాలిక రేప్ అండ్ మర్డర్ కేస్ ఎన్నో మలుపులు తిరిగింది. 24 గంటల సమయంలోనే నిందితుడు శవమై కనిపించడం కలకలం రేపింది. ఈనెల 16 న సాయంత్రం 4 గంటల సమయంలో మైనర్ బాలిక అదృశ్యం కావడం.. 17 న ఉదయం హత్యకు గురై నిందితుడి ఇంటిలో ఉన్న నీటి డ్రమ్ములో శవమై తేలడం.. నిందితుడు కులవర్ధన్ ను తమకు అప్పగించాలంటూ 10 గంటలకు పైగా స్థానికులు ఆందోళన చేయడం లాంటి ట్విస్ట్ లు నెలకొన్నాయి. గంటల తరబడి హైడ్రామా కూడా నడిచింది. నిన్న రాత్రి మైనర్ బాలిక డెడ్ బాడీకి పోస్టు మార్టం నిర్వహించడం, అంత్యక్రియలు పూర్తి చేయడం జరిగిపోయింది. అయితే, మైనర్ బాలిక అంత్య క్రియలు పూర్తయ్యేలోపే ఉదయమే మరో ట్విస్ట్ తెర మీదకు వచ్చింది. కురబల కోట మండలం మైనర్ బాలిక మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్న కుల వర్ధన్ కలసానివారిపల్లి చెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహంగా ఆచూకీ లభించింది. కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నమయ్య జిల్లా ఎస్పీ కూడా నిర్ధారించారు. స్థానికుల నుంచి కులవర్ధన్ ను రక్షించే ప్రయత్నంలో అదుపులోకి తీసుకొని రక్షక్ వాహనంలో తరలిస్తుండగా తప్పించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్పీ ధీరజ్ మీడియాకు వివరించారు. పోలీసుల నుంచి తప్పించుకున్న కులవర్ధన్ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకున్నామని ఎస్పీ ధీరజ్ తెలిపారు..

**కామాంధుడి కథ ముగిసింది.. మరికొందరి పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు..**

ఇక ఆత్మహత్యతో శవమై దొరికిన నిందితుడు కులవర్ధన్ డెడ్ బాడీ పోస్టుమార్టం పై సస్పెన్స్ కొనసాగింది. కులవర్ధన్ తల్లి, బంధువులెవరు ముందుకు రాకపోవడంతో పోస్టుమార్టం ఆలస్యమైంది. మైనర్ బాలిక అంత్యక్రియలు జరగకముందే నిందితుడు ఉదయమే శవమై దొరికినా శవపరీక్ష చేయడానికి మాత్రం పోలీసులకు ఛాలెంజ్‌గా మారింది. తల్లి అంజలి కొడుకు కులవర్ధన్ డెడ్ బాడీని చూసేందుకు, తీసుకునేందుకు ముందుకు రాలేదు.. దీంతో పోస్టుమార్టం పూర్తయ్యాక కులవర్ధన్ డెడ్ బాడీని మార్చురీలోనే పోలీసులు ఉంచాల్సి వచ్చింది. కురబల కోట వీఆర్వో సుస్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇప్పుడు మైనర్ బాలిక హత్య, నిందితుడి ఆత్మహత్య కేసుల్లో పురోగతి సాధించగా.. ఇప్పుడు మరో కోణంలో దర్యాప్తు షురూ చేశారు. మైనర్ బాలిక మర్డర్ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఉద్రిక్తతకు దారి తీసిన పరిస్థితులు, కారకులతోపాటు కులవర్ధన్ తల్లి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. దీనిలో ఎవరి పాత్ర ఎంత. ఏంటి.అనే తేల్చే పనిలో పోలీసులు ఉన్నారు. ఇంత గొడవకు కారణం. ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఉందో తెల్చే పనిలో ఉన్న పోలీస్ అధికారులు అందరినీ విచారించేందుకు సిద్ధమయ్యారు.

# కామారెడ్డి లో ఉద్రిక్తికర పరిస్థితులు..

కామారెడ్డి: ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)



కోనసాగుతున్న అరెస్ట్ ల పర్వం కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన పోలీస్ బలగాలు. కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్న పోసానిపేట్ మాజీ సర్పంచ్ గిరెడ్డి మోహన్ రెడ్డి కారు ను బోల్తా పడిసిన బిజెపి కార్యకర్తలు. కారుకు తగల పెట్టిన బిజెపి కార్యకర్త. మంటలను అర్పి కారు ను పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఇంటి వద్ద పోలీస్ ప్రహర కొనసాగుతుంది.

# పరిశుభ్రత పరిరక్షణ కార్యక్రమాలలో సొంత డబ్బులతో కృషి చేసిన ఉపసర్పంచ్ అట్కరి కృష్ణ....

బీర్కూర్: ఫిబ్రవరి 21 ( జన సంఘర్షణ)



కిష్టాపూర్ గ్రామంలో పరిశుభ్రత పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. ఇలాంటి సేవలు ఇంకా ఎన్నో చేయాలని ఉంది అని అన్నారు.

# అంగన్వాడీ, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసిన తహసీల్దార్...

రాజంపేట : ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)




రాజంపేట మండల కేంద్రంలోని 04 అంగన్వాడీకేంద్రాలను, బాలికల ఉన్నత పాఠశాలలను రాజంపేట తహసీల్దార్ జానకి శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు, అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీ లకు, బాలింతలకు అందిస్తున్న ఆహార వివరాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనపు నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార రుచి మరియు ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ప్రభుత్వం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు నేరుగా సంప్రదించి ఫిర్యాదు చేయాలని విద్యార్థులతో తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తత

రుద్రూర్: ఫిబ్రవరి21( జన సంఘర్షణ)





నిజామాబాదు ఉమ్మడి జిల్లాల కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. క్యాంపు ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించారు. దీంతో బీజేపీ కార్యకర్తలు ఆయన కారును ధ్వంసం చేసి పల్టీ కొట్టించారు. బీజేపీ ఎమ్మెల్యే అరోరా భూములు కబ్జా చేశారని కాంగ్రెస్ నేత షబీర్ అలీ ఆరోపించారు. దీంతో దమ్ముంటే ఆధారాలతో చర్చకు రావాలని వెంకటరమణ రెడ్డి సవాల్ విసిరారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ నెలకొంది. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు మహేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

## ఇల్లందు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన డిఎస్పి వెంకన్న బాబు

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు. ప్రతినిధి. (జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు కోరం కనకయ్య ని నూతనంగా ఇల్లందుకు బదిలీపై వచ్చిన డీఎస్పీ వెంకన్న బాబు మర్యాదపూర్వకంగా కలిసిన ఈ ఘటన రాజకీయ, పాలనా పరంగా ప్రాధాన్యత కలిగినదిగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిది, పోలీసు ఉన్నతాధికారి మధ్య జరిగే తొలి భేటీ కేవలం మర్యాదపూర్వక సమావేశం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో పరిపాలనా సమన్వయానికి బాటలు వేసే చర్యగా చూడవచ్చు. ముఖ్యంగా శాంతి భద్రతల అంశంలో ఎమ్మెల్యే గారు ప్రత్యక్షంగా చర్చించడం ద్వారా, ప్రాంతీయ సమస్యలపై తన అప్రమత్తతను చూపించినట్టుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో గ్రామాలు, పట్టణాల్లో సామాజిక మార్పులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, పోలీస్ శాఖ, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం మరింత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమావేశం ద్వారా అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, యువతను సక్రమ దిశగా మలచడం, ప్రజల్లో భద్రతాభావాన్ని



పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి కేంద్రీకృతమైందని అంచనా వేస్తున్నారు. అలాగే, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ స్థానిక ప్రజాప్రతినిధిని ముందుగా కలవడం పరిపాలనా సంప్రదాయానికి అనుగుణంగా ఉన్నప్పటికీ, ఇది భవిష్యత్‌లో వేగవంతమైన నిర్ణయాలకు దోహదపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద, ఈ భేటీ నియోజకవర్గ పరిపాలనలో సమన్వయాన్ని బలోపేతం చేసే దిశగా ఒక సానుకూల అడుగుగా భావించవచ్చు.

# జోరుగా మొరం త్రవ్వకాలు

- చిన్న స్థాయి అధికారులనుంచి పెద్ద స్థాయి అధికారి వరకు నిద్రమత్తులో మునిగినారు
- మైనింగ్ ఏడి మీరు ఏం చేస్తున్నారు మీ కళ్ళకు గంటలు కట్టుకున్నారా
- రోడ్డు పక్కనే త్రవ్వకాలు చేయడం వల్ల పెద్ద గుంతలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో భయం గుప్పెట్లో ప్రజలు ప్రయాణికులు

చందూర్: ఫిబ్రవరి21 (జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం లక్ష్మాపూర్, కారేగాం శివారు ప్రాంతంలో తిమ్మాపూర్ శివారు ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కనే జోరుగా మొరం త్రవ్వకాలు చేస్తున్న వైనం పలువురికి నీవేర పరుస్తుంది. మొరం త్రవ్వకాలు ప్రతిరోజు ఇలా జరుగుతుందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ప్రతిరోజు మొరం త్రవ్వకాలు చేయడం వల్ల పెద్ద గుంత ఏర్పడిందని వాహనపుదారులు ప్రయాణికులు ఈ రహదారి గుండా వెళ్లడానికి భయం పడుతున్నారని పాదమరిస్తే గుంతలో పడి ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని, కొన్నిసార్లు అనుమతులు కొన్నిసార్లు అనుమతులు లేకుండా జోరుగా మొరం త్రవ్వకాలు చేయడం వల్ల వాల్టా చట్టానికి తూట్లు పడుతుందని ఇలాగైతే భావితరాల వారికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు అంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. అదే విధంగా గ్రామ సర్పంచ్ ను ఫోన్ చేస్తే ఎమ్మార్వోకు మాట్లాడి గుడి కోసం మొరం త్రవ్వకాలు చేస్తున్నామని కొంతమంది అక్రమంగా మొరం త్రవ్వకాలు చేస్తున్న విషయం వాస్తవమే అని, మా గ్రామస్తులు కాకుండా ఇతర గ్రామస్తులు కొంతమంది అక్రమంగా క్రమకాలు చేస్తున్నారని సమాధానం ఇచ్చారు.



## దారుణం.. ప్రేమించి దూరం పెడుతోందని యువతిపై సుత్తితో దాడి

వర్ని: ఫిబ్రవరి21(జన సంరక్షణ)

సూర్యాపేటలో ప్రేమ సంబంధిత దాడుల పరంపరలో మరో ఘాతుకం చోటుచేసుకుంది. ఎనిమిదేళ్లుగా ప్రేమించుకున్న యువతి దూరం పెడుతోందనే కోపంతో ఓ యువకుడు ఆమెపై సుత్తితో దాడి చేశాడు. ఈ ఘటన సూర్యాపేటలోని స్నేహానగర్‌లో జరిగింది. నూతనకల్ మండలం లింగంపల్లికి చెందిన మహేష్, అలుగునూరుకు చెందిన స్పందన ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే వారి ప్రేమకు యువతి కుటుంబం అంగీకరించకపోవడంతో పెద్ద మనుషుల పంచాయతీ జరిగింది.ఇద్దరూ దూరంగా ఉండాలని తీర్మానించారు. దీని తర్వాత స్పందన మహేష్‌ను దూరం పెడుతూ వచ్చింది. ఆగ్రహించిన మహేష్, స్పందన తన సోదరి ఇంట్లో ఉందని తెలుసుకొని, ఎవరూ లేని సమయంలో లోపలికి వెళ్లి ఆమె తలపై సుత్తితో బలంగా దాడి చేశాడు.




## వాగుల నుంచి జోరుగా ఇసుక తరలింపు

చందూర్: ఫిబ్రవరి21( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా చందూర్ వాగు తిమ్మాపూర్ వాగు అదే విధంగా లక్ష్మాపూర్, గోవురు వాగు నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా పగలు రాత్రి తేడా లేకుండా జరుగుతుందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు వాగులలో డంపు ఉంచడంతోపాటు ప్రధాన కూడలి వద్ద డంపు ఉంచుతూ ఇసుకను అధిక రేట్లకు అవసరం ఉన్నవారికి విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ప్రజలు అంటున్నారు. చందూరు మండలంలో ఈ వాగుల వద్ద అసలు ఇసుక పాయింట్ లేదు అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఇసుక పైంట్ అనేది చందూరు మండలంలోని వాగుల వద్ద ఇతర గ్రామాల్లో ఉన్న వాగుల వద్ద కూడా లేదని, ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఇసుక అవసరమై ఉంటే పాయింట్ ఉన్న ప్రదేశాల నుంచి ఇసుకను తెప్పించి దంపు ఉంచి అక్కడి నుంచి ఇసుకను పర్మిషన్ ఇస్తామని అన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా మోహనరావు పటేల్ ప్రజా ట్రస్ట్



కుబీర్, ఫిబ్రవరి21 (జన సంఘర్షణ)

కుబీర్ మండలంలోని సిరిపెల్లి గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్తో ఇల్లు దగ్ధమైన విషయము తెలిసిందే. ఇంట్లో నివసిస్తున్న సాయవ కుటుంబానికి కేవలం వేసుకున్న దుస్తులు మిగిలాయి. సంవత్సరానికి సరిపోయే వంట సామాగ్రి మొత్తం కాలిపోయింది.కొంత నగదు,ఇంటి కాగితాలు ఏమి మిగలకుండా మంటల్లో కాలి బుడిదైపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మోహన్ రావు పటేల్ ఈరోజు సిర్పేలి గ్రామానికి వెళ్లి ఆ బాధిత కుటుంబానికి పరామర్శించి నెల రోజులకు సరిపడే బియ్యము, అదేవిధంగా తన వంతుగా ఆర్థిక సాయం అందించాలన్న ఉద్దేశంతో చెక్కు రూపంలో డబ్బులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఆరేపల్లి సతీష్, మాజీ సర్పంచ్ రాజేందర్,మాజీ సర్పంచ్ దత్తురాం పటేల్,పల్సి సర్పంచ్ రాములు, గ్రామ యువ నాయకుడు సబ్బిడి రాజు, గణేష్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొనడం జరిగింది. మోహన్రావు పటేల్ మాట్లాడుతూ ఐదు జరగరాని సంఘటనలు జరిగినప్పుడు ప్రజా ట్రస్ట్ అందుబాటులో ఉండి కావాల్సిన సదుపాయాలను లేదా ఆర్థికంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. అదేవిధంగా సిరిపెల్లి గ్రామస్తులు జరిగిన సంఘటన తెలుసుకొని గ్రామానికి వచ్చి ఆర్థికంగా ఆదుకున్నమోహన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎంపీపీ సుభాష్ పటేల్ పాల్గొనడం జరిగింది.

## 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

21..2.. ఫిబ్రవరి జనసంఘర్షణ ప్రతినిధి జిల్లా బ్యూరో ఎస్ కే అన్వర్



మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల 108 అంబులెన్స్ వాహనాలను జిల్లా సమన్వయకర్త సతీష్ తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలను వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే వాహనం మరమ్మలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 108 సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది పరమ సునీల్ కుమార్ భాగ్యమ్మ నరేందర్ కుమార్ , అనిల్, తరుణ్, అశోక్, శ్రావణ్ , కళ్యాణ్ , ప్రసాద్ , సూర్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కుంటాల మండల కేంద్రంలో సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూన్న ముధోల్ ఎమ్మెల్యే

కుంటాల, ఫిబ్రవరి21 (జన సంఘర్షణ)



కుంటాల మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ఆయా గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 37 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మండలంలోని సాంకేతిక సమస్యలపై తక్షణ స్పందన చూపిన ఎమ్మెల్యే, సూర్యాపూర్ మరియు దౌనెల్లి గ్రామాల్లో నెలకొన్న నెట్‌వర్క్ సమస్యలను పరిష్కరించేందుకు (బీఎస్ఎన్ఎల్) టవర్ మంజూరు పత్రాన్ని గ్రామ ప్రజాప్రతినిధులకు అందజేశారు. దీంతో ఆ గ్రామాల ప్రజల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. అలాగే మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై సమగ్రంగా సమీక్షించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళశాల కు 21 లక్షల రూపాయల నిధుల మంజూరు

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



తానుర్, ఫిబ్రవరి21 (జన సంఘర్షణ)

తానూర్ ప్రభుత్వ జూనియర్ కళశాల కు 21 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. ఇంటిగ్రెటెడ్ సైన్స్ మాథ్స్ ల్యాబ్ కు ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు.సమగ్ర శిక్ష అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల కు ఆధునిక టెక్నాలజీ తో ల్యాబ్‌లను రూపొందించేందుకు ఈ నిధులు విడుదల చేసిందన్నారు..

## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం..

బీర్కూర్: ఫిబ్రవరి 21 ( జన సంఘర్షణ)



కిష్టాపూర్: కుమ్మరి తుకాబ్బాయి భర్త కుమ్మరి బాలయ్య అనుకోకుండా షార్ట్ సర్క్యూట్ తగిలి ఇల్లు మొత్తం దగ్ధం లోపలికి వెళ్లి చూడగా మొత్తం బట్టలు ఒక లక్ష రూపాయలు నష్టం జరిగిందని భావిస్తున్నారు. రొక్క ఆడితే గాని డొక్కా గడవని జీవితం ఈ విషయం పరిగణలు తీసుకొని ప్రభుత్వం ఎంతో కొంత సహాయం చేయాలని కోరుకుంటున్నారు.

## శ్రీ వేశాలమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు గా గురు ప్రసాద్



తిరుపతి, ఫిబ్రవరి21( జన సంఘర్షణ)
తిరుపతి నగరంలోని శ్రీ వేశాలమ్మ ఆలయ పాలకమండలి సభ్యులుగా రంగన్న గురు ప్రసాద్ (బాలు ) నియమితులయ్యారు. చైర్మన్ జగదీష్ తో పాటు 11 మంది పాలకమండలి సభ్యులను నియమించారు. వీరంతా రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. శ్రీ వేశాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని బాలు తెలిపారు. గురు ప్రసాద్ ( బాలు ) జనసేన పార్టీలో గత పది సంవత్సరాలుగా క్రియాశీలకంగా పని చేస్తూ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతల దృష్టిలో పడ్డారు. బాలు సేవలను గుర్తించిన జనసేన పార్టీ అధిష్టానం శ్రీ వేశాలమ్మ ఆలయ పాలకమండలి సభ్యులుగా నియమించారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి సభ్యులు పగడాల మురళి లతో పాటు రాష్ట్ర, జిల్లా ముఖ్య జనసేన నాయకులకు బాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి



రొంపిచర్ల ఫిబ్రవరి21( జన సంఘర్షణ)
పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలం లొ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాన్ని ప్రారంభించి స్వచ్ఛ రథం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి గృహ అవసరాలకు ఉపయోగపడే నిత్యావసరాలను అందించు వాహనాన్ని పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం తడి చెత్త పొడి చెత్త గా వేరు చేసిన డస్ట్ బిన్ల ద్వారా గృహాల నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ వరకు వాహనాన్ని నడిపి గ్రామస్తుల దగ్గర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ద్వారా రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మండలం తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంబంధిత అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో కేంద్రమంత్రి

శ్రీకాళహస్తి ఫిబ్రవరి21( జన సంఘర్షణ)



శ్రీకాళహస్తి దేవస్థానముకు కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, గల్లా జయదేవ్, స్వామివారి దర్శనానికి విచ్చేసిన సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి, ఆలయ ఈవో బాపిరెడ్డి, దేవస్థానం చైర్మన్ కొట్టేసాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి,వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేసి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు రావెళ్ళ మునిరాజా నాయుడు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ని కలసిన బైరెడ్డిపల్లి ఎంపీడివో ఉపేంద్ర

బైరెడ్డిపల్లి ఫిబ్రవరి21( జన సంఘర్షణ)




పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని బైరెడ్డిపల్లి ఎంపీడివో ఉపేంద్ర శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అకౌంట్స్ సెక్షన్ ఆఫీసర్ గా పని చేస్తూ పదోన్నతి లో భాగంగా బైరెడ్డిపల్లి ఎంపీడివో గానియమితులు అయ్యారు. విధుల్లో చేరిన అనంతరం అసెంబ్లీ సమావేశాల నుంచి విచ్చేసిన ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.

# బాన్సువాడలో బంద్ ప్రశాంతం

◆ స్వచ్ఛందంగా వాణిజ్య, వ్యాపార సముదాయాలు మూసివేత......

బాన్సువాడ: ఫిబ్రవరి21( జన సంఘర్షణ)
బాన్సువాడ పట్టణంలోని తాడుకోల్ చౌరస్తా వద్దగల రిలయన్స్ జియో మార్కెట్ సముదాయం లో సేల్స్ గర్ల్స్ పై ఓ వర్గానికి చెందిన వ్యక్తి అసభ్య పదజాలం తో దూషించడమే కాకుండా భక్తి గీతాలను ఎందుకు ఆ పెట్టావంటూ వాటిని ఆపివేయాలని హెచ్చరిస్తూ సేల్స్ గర్ల్స్ ను వీడియో తీయడం పట్ల ఈ విషయంపై షాప్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒకేసారి రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత చేసుకుంది. శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బాన్సువాడ పట్టణం లో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఓవర్గంపై మరో వర్గం రాళ్లు దువ్వడం పట్ల పోలీసులకు సైతం గాయాలు అయ్యాయి. దీనిని నిరసిస్తూ హిందూ సంఘాలు శనివారం బాన్సువాడ బంద్ కు పిలుపునిచ్చారు. బంద్ పిలుపు మేరకు బాన్సువాడ పట్టణం స్వచ్ఛందంగా వ్యాపార వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. పెట్రోల్ బంకులు పనిచేయలేదు. కొన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బందు పాటించాయి. బందు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర .బాన్సువాడ లోనే మకాం వేసి ఎప్పటికప్పుడు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.






బాన్సువాడ పట్టణంలో 12 చోట్ల పోలీస్ టికెట్లను ఏర్పాటు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. రిలయన్స్ మార్కెట్లో సేల్స్ గర్ల్స్ పై అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. శనివారం ఉదయం బాన్సువాడ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి జరిగిన సంఘటన తీవ్రంగా పరిగణిస్తున్నామని దీంట్లో 42 మందిని గుర్తించామని వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ వెల్లడించారు. బంద్ సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు వహార కాస్తున్నారని జిల్లా ఎస్పీ వెల్లడించారు. మత ద్వేషాలకు ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఘాటుగా హెచ్చరించారు. ఒక వర్గం ఇచ్చిన బందు పిలుపుమేరకు బాన్సువాడలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది.

## వైసిపి జిల్లా( ఎస్ టి )విభాగం కార్యనిర్వాహక సభ్యులుగా కిల్లా లోకకల్యాణ్




కోటా ఫిబ్రవరి21( జన సంఘర్షణ)).
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి అనుచరుడు కిల్లా లోకకళ్యాణ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా( ఎస్టి) విభాగం కార్యనిర్వాహక సభ్యులుగా నియమితులయ్యారు. శు క్రవారం వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం కిల్లా లోకకళ్యాణ్ ని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైసీపీ ఎస్ టి విభాగం కార్యనిర్వాహక సభ్యులుగా నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది.దీనితో పలువురు వైసిపి పార్టీ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కళ్యాణ్ కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిల్లా లోకకళ్యాణ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.వైసిపి నెల్లూరు జిల్లా విభాగం కార్యనిర్వాహక సభ్యులుగా తనను నియమించిన పార్టీ అధిష్టానానికి,నా దైవ సమానులు పెద్దలు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి , పెద్దలు వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి శ్రీ.పాదర్తి రాధా కృష్ణ రెడ్డి కి, గూడూరు నియోజకవర్గం సమన్వయకర్త ఎమ్మెల్సీ పెద్దలు .మేరిగ మురళీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుప్పం ఇంజినీరింగ్ కాలేజీలో డేటా స్టార్మ్ 2కె26 ఘన విజయం



కుప్పం,ఫిబ్రవరి21( జన సంఘర్షణ):
కుప్పం ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన డేటా స్టార్మ్ 2కె26 టెక్నికల్ సింపోజియం ఘనవిజయం సాధించింది. వివిధ కళాశాలల నుండి 250 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. సి. శోభా బిందు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భవిష్యత్తులో ఉత్తమ ఉద్యోగాలను సాధించాలంటే సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు, ముఖ్యంగా, జట్టుగా ప్రాజెక్టులు చేయడం ద్వారా పరస్పర జ్ఞానాన్ని పంచుకోవడం చాలా ముఖ్యమని ఆమె తెలిపారు.అలాగే కృత్రిమ మేధస్సు సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరిగ్గా వినియోగిస్తే మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి లీట్ కోడ్ వంటి ఆన్లైన్ వేదికలను వినియోగించి ప్రోగ్రామింగ్ సమస్యలను సాధన చేయాలని సూచించారు.కళాశాల చైర్మన్ డా.బి. సి. నాగరాజ్ , వైస్- చైర్మన్ డా. సునీల్ రాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధాకర్ బాబు విభాగం నిర్వహించిన ఈ సింపోజియాన్ని ప్రశంసించారు. డేటా సైన్స్ విభాగాధిపతి డా. ఎస్. జ్ఞానమూర్తి నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.డేటా స్టార్మ్ 2కె26 సింపోజియంలో 10 టెక్నికల్ మరియు నాన్- టెక్నికల్ పోటీలు నిర్వహించగా, విజేతలకు మొత్తం 20,000 నగదు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు ప్రదానం చేయబడ్డాయి.ఉపాధ్యాయులు, విద్యార్థి సమన్వయకర్తలు, వాలంటీర్లు సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శాంతిరాం ఆసుపత్రి వైద్యుల అద్భుతం

◆ తెగిపోయిన చెవిని తిరిగి అతికించిన ప్లాస్టిక్ సర్జన్ శ్రీ హర్ష

నంద్యాల ఫిబ్రవరి21( జన సంఘర్షణ)
ఆధునిక వైద్య సాంకేతికత, వైద్యుల అసాధారణ నైపుణ్యం కలిస్తే ప్రాణాపాయం నుండే కాకుండా, కోల్పోయిన శరీర భాగాలను కూడా తిరిగి పొందవచ్చని నంద్యాలలోని శాంతిరాం ఆసుపత్రి వైద్యులు నిరూపించారు. పొలం పనిలో ప్రమాదవశాత్తు తెగిపోయిన ఒక మహిళా రైతు చెవిని అత్యంత క్లిష్టమైన ప్లాస్టిక్ సర్జరీ ద్వారా విజయవంతంగా అతికించారు.

ప్రమాదం జరిగిన తీరు: నంద్యాల జిల్లాకు చెందిన కృష్ణవేణి అనే మహిళా రైతు తన పొలంలో వరి కోత మిషన్ వద్ద పనులు నిర్వహిస్తుండగా ఊహించని విధంగా ప్రమాదం జరిగింది. మిషన్ పక్క నుండి వెళ్తున్న సమయంలో ఆమె ఎడమ చెవి పూర్తిగా తెగి శరీరం నుండి వేరుపడింది. గమనించిన తోటి కూలీలు వెంటనే అప్రమత్తమై, తెగిపోయిన చెవి భాగాన్ని భద్రపరిచి బాధితురాలిని వెంటనే శాంతిరాం ఆసుపత్రికి తరలించారు.



డాక్టర్ శ్రీ హర్ష సమయస్ఫూర్తి:
కేసు తీవ్రతను గమనించిన ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు డాక్టర్ శ్రీ హర్ష , వెంటనే బాధితురాలిని పరీక్షించారు. తెగిపోయిన భాగాన్ని తిరిగి అతికించడం మైక్రో-వాస్క్యులర్ రెప్లంటేషన్ అనేది వైద్య శాస్త్రంలో ఒక సవాలుతో కూడుకున్న పని. అయినప్పటికీ, డాక్టర్ శ్రీ హర్ష వారి బృందం గంటల తరబడి శ్రమించి, తెగిపడిన ఆమె చెవి భాగం లోని ఎముకను వాడి ఆమె చెవిని తిరిగి అమర్చబడింది.



సర్జరీలోని ప్రధానాంశాలు:
సమయపాలన: ప్రమాదం జరిగిన వెంటనే తెగిపోయిన భాగాన్ని సురక్షితంగా తీసుకురావడం వల్ల సకాలంలో సర్జరీ సాధ్యమైంది. కోలుకుంటున్న బాధితురాలు: ప్రస్తుతం బాధితురాలు ఆరోగ్యంగా ఉన్నారని, అతికించిన చెవికి రక్త ప్రసరణ సాధారణంగా జరుగుతోందని వైద్యులు ధృవీకరించారు. బాధితురాలి కృతజ్ఞతలు: తన ముఖం వికృతంగా మారిపోతుందేమో అని భయపడిన బాధితురాలు కృష్ణవేణి, తన చెవిని తిరిగి యథావిధిగా అమర్చినందుకు డాక్టర్ శ్రీ హర్ష కి శాంతిరాం ఆసుపత్రి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు డాక్టర్ శ్రీ హర్ష సూచన:“ప్రమాదం జరిగినప్పుడు శరీర భాగాలు తెగిపోతే ఆందోళన చెందకుండా, ఆ భాగాన్ని తడి లేని క్లీన్ ప్లాస్టిక్ కవర్లో పెట్టి, దానిని ఐస్ ముక్కలు ఉన్న మరో కవర్లో ఉంచి వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకురావాలి.” నంద్యాల ప్రాంతంలో ఇలాంటి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం పట్ల స్థానికులు, బాధితురాలి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
22 ఫిబ్రవరి 2026

# నంద్యాలలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం

- ప్రారంభించిన రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి.
- రెండు రోజులపాటు జరిగే టోర్నమెంట్ లో వివిధ రాష్ట్రాలు, తెలుగు రాష్ట్రాల జిల్లాల నుండి 300 మంది పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు.
- విజేతలకు 3 లక్ష రూపాయల నగదు బహుమతులు,ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు ఆదివారం సాయంత్రం అందజేస్తారు.

నంద్యాల ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)...

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ శనివారం నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన,నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి టోర్నమెంట్ లాంచనంగా ప్రారంభించారు. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ ను డాక్టర్ రవికృష్ణ, రామకృష్ణ విద్యా సంస్థల డైరెక్టర్ హేమంత రెడ్డి చెస్ బోర్డుపై పావులు కదిలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెట్టే క్రీడ అని, నంద్యాలలో అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. చెస్ అభివృద్ధి కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులను చదువుతోపాటు క్రీడలలో ప్రోత్సహించాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ క్రీడాకారులలో ఏకాగ్రత ఇనుమడింప చేస్తుందని, గెలుపు ఓటములను స్వీకరించే మానసిక స్థైర్యం అలవడుతుందని తద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులపై మార్కులు,ర్యాంకులు కోసం ఒత్తిడి పెంచరాదని, చదువుతోపాటు క్రీడలు, కళలలో ప్రోత్సహించడం ద్వారా వారికి మానసిక వికాసం జరుగుతుందని అన్నారు. జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో వివిధ రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఉన్న వివిధ జిల్లాల నుండి 300 మంది పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. విజేతలకు 3 లక్ష రూపాయల నగదు బహుమతులు, ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు ఆదివారం సాయంత్రం ప్రదానం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ ఫణి కుమార్,డిప్యూటీ చీఫ్ ఆర్బిటర్ మణికంఠ,నంద్యాల జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, టోర్నమెంట్ నిర్వాహకురాలు సుజాత, క్రీడాకారులు, కోచ్ లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# శ్రీ కనుపూరు ముత్యాలమ్మ జాతర ను రాష్ట్ర పండుగ గుర్తించెలా కృషి: ఎమ్మెల్యే

- తూర్పు కనుపూరులో అన్నీ శాఖల అధికారులు తో ఎమ్మెల్యే, ఆర్డివో సమీక్షా
- ఎమ్మెల్యే, ఆర్డివో కు ఘన స్వాగతం పలికిన దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరధరామిరెడ్డి, ఈవో కుమార్ నవీన్
- 2026మార్చి 10,11,12,13 తేదీల్లో నాలుగు రోజులు జాతర

మనుబోలు. ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)...





శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం,తూర్పు కనుపూరు గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన ప్రసిద్ధ గ్రామ దేవత శ్రీ కనుపూరు ముత్యాలమ్మ జాతరను రాష్ట్ర పండుగ గుర్తించెలా కృషి చేస్తాననీ అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి లను కలిసి వినతి పత్రాలు అందజేస్తాననీ గూడూరు నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్శనివారం హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికిన దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరధరామిరెడ్డి, ఈవో కుమార్ నవీన్ 2026 మార్చి 10 నుండి 14 వరకు జరిగే శ్రీ కనుపూరు ముత్యాలమ్మ జాతరలో సౌకర్యాల కల్పన పై కోట, చిల్లకూరు, గూడూరు మండలాల్లో నీ అన్నీ శాఖల అధికారులు తో శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం కు చెందిన సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశింసునీల్ కుమార్, ఆర్డివో అనూష లు పాల్గొన్నారు. వీరికి దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరధ రామిరెడ్డి, ఈవో కుమార్ నవీన్ మరియు ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువా లతో సత్కరించారు. జాతరలో అన్నీ శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలి:ఎమ్మెల్యే

తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో జరిగే శ్రీ కనుపూరు ముత్యాలమ్మ జాతర అత్యంత ప్రసిద్ధమైనది. ఉగాదికి ముందు వచ్చే మంగళవారం 10 వ తేదీ ప్రారంభమై14 తేది వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరకు, పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు భారీగా (సుమారు 5 లక్షల మంది) తరలివస్తారు. భక్తుల రద్దీని, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ జాతరను విజయవంతం చేయడానికిఅన్నీ శాఖల అధికారులు సమన్వయం తో కలిసి పని చేసి జాతర ను విజయవంతం చేయాలనీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్, ఆర్డివో అనూష లు కోరారు. దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరధ రామిరెడ్డి ఆధ్వర్యంలో జాతర అదరహోలి తూర్పు కనుపూరులో జరిగే శ్రీ కనుపూరు ముత్యాలమ్మ జాతరఈ సంవత్సరం శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం నూతన చైర్మన్ చిల్లకూరు దశరధ రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే జాతర చరిత్రలో చెప్పుకొనే విధంగా చేయాలనీఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ చెప్పుకొచ్చారు.దేవస్థానం నిధులు చాలకపోయినాచైర్మన్ చిల్లకూరు దశరధరామిరెడ్డి సొంత నిధులు ఖర్చు చేసి అందరూ జాతర అదరహో అనేలా చేస్తారని ఆశిస్తునట్లు ఎమ్మెల్యే అన్నారు.దశరధ రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే జాతర లో అన్నీ శాఖల అధికారులు ఆయనకు సహకరించాలని ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు.అధికారులు, వి ఐ పి, ప్రెస్ కు పాస్ లు ఇవ్వండి: ఎమ్మెల్యే. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో జరిగే శ్రీ కనుపూరు ముత్యాలమ్మ జాతరలో అన్నీ శాఖల అధికారులుకు, వి. ఐ పి, ప్రెస్ వాళ్లకు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, కమిటీ సభ్యులకు పాస్ లు అందించాలని పోలీసు శాఖ, ఆలయ ఈ వో నవీన్ కుమార్ లకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు.రోడ్ల నిర్మాణం పై ఇచ్చినా హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే.గత ఏడాది జరిగిన సమావేశంలో తూర్పు కనుపూరుగ్రామానికి నూతన రోడ్డు వేయిస్తాను అని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హామీఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం జరిగే జాతర కు ముందే రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం తో స్థానిక ప్రజలు మరియు దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశ రథ రామిరెడ్డి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.అయితే ఈ సందర్భంగా చైర్మన్ చిల్లకూరు దశ రథ రామిరెడ్డి మాట్లాడుతూ తూర్పు కనుపూరుగ్రామానికి నూతన రోడ్డు నిర్మాణం ఎమ్మెల్యే చేపట్టారు అయన కు కృతజ్ఞతలు తెలుపుతూ అయితే సిద్ద వరం బ్రిడ్జి నుండి కోట వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ను కోరడం తో అయన స్పందించి ఆర్ అండ్ బి అధికారులు వెంటనే ప్యాచ్ వర్క్ చేయాలనీ ఆదేశాలు ఇచ్చారు. 50 యూనిట్లు టిప్పర్ లతో గ్రావెల్ తో కనుపూరు లోనీ దేవస్థానం సమీపంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలనీ చైర్మన్ కోరారు. సౌకర్యాల కల్పన: ఆలయ పరిసరాలలో తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మరియు విశ్రాంతి స్థలాలను ఏర్పాటు చేయాలనీ అధికారులు కు ఎమ్మెల్యే, ఆర్డివో ఆదేశాలు ఇచ్చారు.భద్రతా ఏర్పాట్లు: వేలాదిమంది భక్తుల రద్దీని నియంత్రించడానికి భారీ పోలీసు బందోబస్తు మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టడం.ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే, ఆర్డివో లు కోరారు. ప్రత్యేక పూజలు: ఉగాదికి ముందు మంగళవారం నుండి అమ్మవారికి జరిగే ప్రత్యేక పూజలు, సాంప్రదాయ ఉత్సవాలు (శాకాంబరి అలంకారం, పొంగళ్లు) సజావుగా సాగేలా చూడాలని ఎమ్మెల్యే, ఆర్డివో కోరారు. వైద్య సహాయం: భక్తుల కోసం అత్యవసర వైద్య శిబిరాలు (వైద్య శిబిరాలు )ఏర్పాటు చేయడం.అంబులెన్సు సర్వీస్ లు మొత్తం 5 ఏర్పాటు చేయాలనీ అదేవిధంగా ఓ ఆర్ సి ప్యాకెట్లు భక్తులు అందేలా చూడలన్నారు. 24 గంటలు వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సులు అందరూ జాతర 4 రోజులు అప్రమత్తం గా ఉండాలనీ ఎమ్మెల్యే, ఆర్డివో కోరారు ప్రజా భాగస్వామ్యం: స్థానిక గ్రామస్తులు, దేవదాయ శాఖ మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పారిశుధ్యం, భక్తులసేవలోపాలుపంచుకోవాలని ఈ వేడుకలను క్రమశిక్షణతో, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే జాతర దిగ్విజయ మవుతుందనీఎమ్మెల్యే, ఆర్డివో లు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో అనూష, శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరధ రామిరెడ్డి, ఈవో నవీన్ కుమార్, గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు, పట్టణ సీఐ శేఖర్ బాబు, కోట మండలం తహసీల్దార్ జె జె రావు, చిల్లకూరు ఎస్సై సురేష్ బాబు, విద్యుత్ శాఖ డి ఈ నరేంద్ర రెడ్డి, ఏ డి చిన్నయ్య,చిల్లకూరు ఎంపిడివో గోపి, కోట ఎంపిడివో దిలీప్ కుమార్,ఆలయ కమిటీ సభ్యులు అనీమేల్లా సుబ్రహ్మణ్యం, వినుకొండ సుబ్రహ్మణ్యం, తుపిలి పద్మమ్మ, దువ్వూరు అనిత, అన్నం ముని శేఖర్, మేకల కమల, బొప్పాయి ఉమా మహేశ్వరీ, పొక్కలి శ్రీ లక్ష్మి, సారంగం రమేష్ టీడీపీ నాయకులు పట్టాభి రెడ్డి,రఘు, మీజూరు మల్లికార్జున రావు, దార సురేష్, పొక్కలి బాలాజీ, దామవరపు బాల సుబ్రహ్మణ్యం, రాయపు పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 22 న ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

- ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ నాయుడు.

కుప్పం,ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, ఏరియా హాస్పిటల్లో నేడు 22వ తేదీ ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ నాయుడు తెలిపారు ఆదివారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు రక్త దాన తీవ్రం ఉంటుందన్నారు. రక్తదానం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతు ందన్నారు.కొత్త రక్తకణాల ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షలు బిపి, హెచ్ఐవి మొదలైనవి చేపట్టడం జరుగుతుందన్నారు. 18--65 సంవత్సరాల మధ్య వయస్సు, 45 కిలోల పైగా బరువు ఉన్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చు అన్నారు. ఒక రక్తదానం -- మూడు ప్రాణాలకు ఆశ అన్నారు.రక్తాన్ని ఇవ్వండి ప్రాణాన్ని నిలబెట్టండి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కే.డి.సి నాగాస్త్ర బ్యానర్ విడుదల

కుప్పం, ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ)




కుప్పం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం కోలాహలంగా నాగాస్త్ర బ్యానర్ రిలీజ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 28వ తేదిన జరగబోయే 16వ వార్షికోత్సవానికి ప్రముఖ సినీ సింగర్, యూట్యూబర్ సమీరా భరద్వాజ్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఫ్లాష్ మాబ్ లో విద్యార్థిని విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు .ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రానున్న పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలి

కార్వేటినగరం (జన సంఘర్షణ):



రానున్న పదవ తరగతి పరీక్షల్లో 100% వచ్చింది సాధించాలని గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు , ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్ అన్నారు. కార్వేటి నగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీలకు పరీక్షా సామాగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో ప్రతి ఒక్కరు కష్టపడి చదివి పాఠశాలకు గ్రామానికి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాలకు కావలసిన మౌలిక వస్తువులను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ బాధ్యులు మరియు రాష్ట్ర మాల కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ పొన్న యుగంధర్. ప్రధానోపాధ్యాయులు మరి శేఖర్, మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయ యాదవ్ ప్రధాన కార్యదర్శి రాజా ,తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్సై తేజస్విని గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# శిక్షణా తరగతులకు కాంగ్రెస్ నేతలు

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 21 (జన సంఘర్షణ):




తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ నందు ప్రారంభమైనటువంటి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ శిక్షణా తరగతులకు కాంగ్రెస్ నేతలు తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు దెయ్యాల రమేష్ బాబు, చిత్తూరు నగర అధ్యక్షులు టిక్కీ రాయల్, నెల్లూరు జిల్లా డిసిసి అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, ఇతర జిల్లాల డిసిసి అధ్యక్షులు, నగర అధ్యక్షులు శిక్షణ తరగతులో పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్లో బస్తీబాట

**-ప్రజా సమస్యలపై డిప్యూటీ కమిషనర్కు వినతిపత్రం**

**-తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి**



మల్లాపూర్ జన సంఘర్షణ
మల్లాపూర్ డివిజన్లో నిర్వహించిన బస్తీబాట కార్యక్రమం ప్రజా సమస్యలతో కిక్కిరిసిపోయింది. డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో పర్యటించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రజలతో నేరుగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పలు సమస్యలను ప్రజలు ఆవేదనతో వివరించారు.ప్రధానంగా కాలువల శుభ్రత లేకపోవడం, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం, రోడ్ల దుస్థితి, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల సమస్యలు, పారిశుధ్య లోపాలు వంటి అంశాలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.ఈ సమస్యలను సమగ్రంగా ప్రస్తావిస్తూ నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానందున్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజల న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మల్లాపూర్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ వి. శ్రీనివాస్, హరికృష్ణ, సురేష్ తదితరులు పాల్గొని ప్రజల తరపున మద్దతు తెలిపారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, పరిష్కారం దిశగా కట్టుబాటుతో ముందుకు సాగుతామని నేతలు స్పష్టం చేశారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి గొంతుకగా నిరంతరం పోరాడటమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.

# బౌద్ధ భిక్షువుల శాంతి యాత్రకు జై భీమ్ అసోసియేషన్ ఘన స్వాగతం





ఉప్పల్ జన సంఘర్షణ
ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ కర్ణాటకలోని గుల్బర్గా నుండి తెలంగాణలోని నాగార్జునసాగర్ బుద్ధవనం వరకు థాయిలాండ్-ఇండియా బౌద్ధ భిక్షువులు చేపట్టిన శాంతి యాత్ర (ధమ్మయాత్ర ) కు ఉప్పల్ లో జై భీమ్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఘన స్వాగతం పలికారు.ఈ ధమ్మయాత్ర శనివారం ఉదయం రామంతాపూర్ లోని సెయింట్ జాన్ రీజినల్ సెమినరీ చర్చ్ నుండి బయలుదేరి ఉప్పల్ రింగ్ రోడ్డు లోనీ నాలెడ్జి పార్క్ లో గల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. బాబాసాహెబ్ విగ్రహానికి బౌద్ధ భిక్షువులు పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఆ తర్వాత శాంతి యాత్ర నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద గల మంగళ గ్రానైట్ మార్ట్ వద్దకు చేరుకుంది. అక్కడ భిక్షువులందరూ కొద్దిసేపు విశ్రాంతి తీసుకోగా వారికి ధమ్మపద ఫీలోమత్ సొసైటీ (డీ.పీ.ఎస్) సభ్యులు మరియు జై భీమ్ అసోసియేషన్ సభ్యులు తాగు నీరు, పండ్లు, బిస్కట్ లను పంపిణీ చేశారు.ఈ యాత్రలో ధమ్మపద ఫీలోమత్ సొసైటీ (డీ.పీ.ఎస్), జై భీమ్ అసోసియేషన్ సభ్యులు, బౌద్ధ ఉపాసికా - ఉపాసకులు, అంబేద్కరిస్టులు, మానవీయ వాదులు పలువురు పాల్గొని నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద వారికి వీడ్కోలు పలికారు.

# రాష్ట్ర మంత్రి,ప్రముఖులను మర్యాదపూర్వకముగా కలిసిన జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్





జహీరాబాద్ జన సంఘర్షణ:
జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్గా నూతనంగా ఎన్నికైన మహ్మద్ యునూస్ శనివారం హైదరాబాద్లో పలువురు రాష్ట్ర స్థాయి నేతలను, ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా రాష్ట్ర మంత్రివర్యులు దామో దర రాజనర్సింహ ని వారి నివాసంలో కలిసిన చైర్మన్, అనంతరం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్కుమార్ శెట్కార్, టీఫ్రీస్ చైర్మన్ ఫహీం ఖురేషీ, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా॥ సిద్ధం ఉజ్వల్రెడ్డి లను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జహీ రాబాద్ మున్సిపల్ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన యునూస్ ని నాయకులు అభినందిస్తూ, పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రంగా అరుణ్కుమార్, సీనియర్ నాయకులు పట్లోళ్ళ శ్రీకాంత్రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రామాయణ మహాభారతాలు భారతీయ రక్తంలో కలిసిపోయాయి

**-డాక్టర్ మల్లు వేంకట రెడ్డి,తితిదే**

**-జూలేపల్లిలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు**



కర్నూల్ జన సంఘర్షణ
వేల సంవత్సరాల దురాక్రమణదారుల విధ్వం సాలను తట్టుకుని ఈ నాటికీ శ్రీమద్రామాయణ, మహాభారతాల ఖ్యాతి తెలుసుకుంటున్నామంటే, అవి భాలతీయుల రక్తంలో కలిసిపోయాయి కాబట్టేనని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోస్పాడు మండలం, జూలేపల్లి గ్రామంలోని శ్రీ సాయిబాబా మందిరం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడురోజులపాటు శ్రీమద్రామాయణ, మహాభారతం, భగవద్గీతలపై తెలుగు పండితులు డాక్టర్ దోనేపూడి నరేశ్ బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎ. వి. ఎస్. శర్మ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ దోనేపూడి నరేశ్ బాబు, నున్న సుబ్బరాయుడు, కె కృష్ణమూర్తి, రెడ్డి మధు, అడపా వెంకటసుబ్బయ్య, కె శివ, మంజుల రాముడుతోపాటు స్థానిక భక్త సమాజాల సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ముల్కనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

**వైద్య శిబిరాన్ని సందర్శించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ జన సంఘర్షణ:
రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్క నూర్ లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు.హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల ప్రజల కోసం స్థానిక మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు మెగా వైద్య శిబిరంలో ఓపి నమోదు, ,ప్రాథమిక పరీక్షల కౌంటర్లను ,కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతోపాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను , ఈసీజీ మరియు ఎక్సరే పరీక్షలు నిర్వహిస్తుండగా కలెక్టర్ సందర్శించి ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించి అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే హాజరైన సర్పంచులను వారి వారి గ్రామాల నుండి ఎంతమంది ఏ సమస్యలతో రావడం జరిగిందో అడిగి తెలుసుకున్నారు.జనగామ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి జనగామకు చెందిన (8 )విభాగాల నుండి స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ముల్కనూర్ ,వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని డాక్టర్లు ఏఎన్ఎంలు, ఆశా లు , మహిళా సమాఖ్య సభ్యులు , గ్రామ కార్యదర్శులు సంబంధిత గ్రామ ప్రజలను గుర్తించి శిబిరానికి పంపించగా వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. ఈ శిబిరంలో 14 మంది స్పెషలిస్ట్ వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి డాక్టర్లు సూపర్వైజర్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు , రేడియోగ్రాఫర్లపారామెడికల్ సిబ్బంది , ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మొత్తం (75)మందిలపాల్గొన్నారు. అలాగే ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి బీపీ తో పాటు అవసరమైన వారికి షుగర్ , హిమోగ్లోబిన్ పరీక్షలను అక్కడే నిర్వహించగా ఇతర ల్యాబ్ పరీక్షలకు నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ లో పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రత్యేకంగా మొబైల్ ఎక్స్రే మరియు ఈసీజి ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని , స్థానికంగా అందుతున్న వైద్యంతో పాటు, స్పెషలిస్ట్ వైద్య సేవలు అవసరం ఉండి పనుల ఒత్తిడి వల్ల అలాగే వైద్య పరీక్షలకుటెస్టులకు అదనంగా డబ్బులు వెచ్చించలేక పట్టణాలకు వెళ్లలేక పోతున్న వారి కోసం మండల కేంద్రంలో వారికి అందుబాటులో వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో (310)మందికి ఒక్కరికి దాదాపుగా 1800 రూపాయల విలువైన ల్యాబ్ పరీక్షలు చేయడం జరిగింది.5 లక్షల పైగా విలువచేసే మందులను పంపిణీ చేయడం జరిగింది. డి ఎం హెచ్ ఓ విజ్ఞప్తి మేరకుజిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మృత్యుంజయ రెడ్డి దాదాపుగా ఒక లక్షరూపాయల విలువైన మందులు అందించడం జరిగింది. మొత్తం వైద్య శిబిరంలో ( 863)వైద్య సేవలు అందుకోగా అందులో జనరల్ మెడిసిన్ (. 284)ఎముకలవైద్యానికి సంబంధించి ( 143)పిల్లలకు సంబంధించిన సమస్యలు ( 93)చర్మవ్యాధి సమస్యలు ( 44)చెవి ముక్కు గొంతు సంబంధిత సమస్యలు ( 49)జనరల్ సర్జరీ ( 26)స్త్రీలకు సంబంధించిన సమస్యలు (.34)కంటి సమస్యలకు (190)చికిత్స అందించడం జరిగింది. అలాగే మరింత మెరుగైన పరీక్షలు చికిత్స నిమిత్తం (12 ) మందిని ఎంజీఎం ఆసుపత్రి, జీఎం హెచ్ లకు (18) క్యాటరాక్ట్ ఆపరేషన్ నిమిత్తంలరిఫర్ చేయడం జరిగింది(89 ) ఎక్స్ రే మరియు (40) ఈసీజీ పరీక్షలు. లాబ్ పరీక్షలు (310)నిర్వహించడం జరిగిందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య తెలియజేశారు.దృష్టిలోపాలున్న (54) మంది కి పెద్ది వసంత ఫౌండేషన్ ద్వారా అద్దాలు అందజేయడం. జరుగుతుందని శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య, స్థానిక సర్పంచ్. ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్. కే.మమత, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్, ఎర్రబెల్లి సర్పంచ్ కాలేరు శ్రవణ్ విశ్వనాథ కాలనీ సర్పంచ్ కస్తూరి సుధాకర్, ధర్మారం సర్పంచి గోపగోని తిరుపతి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, స్థానిక తహసిల్దార్ రాజేష్ ఎంపీడీవో వీరేశం ,జనగామ నుండి డాక్టర్ డాక్టర్ సంజీవయ్య,. డాక్టర్ హైమావతి డాక్టర్ సుప్రియ ,డాక్టర్ శ్వేత డాక్టర్ మానస్ , డాక్టర్ ఉదయ్. డాక్టర్ సుష్మ డాక్టర్ ప్రశాంత్ ,, డాక్టర్ వర్షిణి, ముల్కనూరు, వంగర ఎల్కతుర్తివైద్యాధికారులు డాక్టర్ స్వప్న ,డాక్టర్ రెహమాన్ ,డాక్టర్ రాజశేఖర్ , డాక్టర్ భార్గవ్ డాక్టర్ సురేష్,, పల్లెదవ ఖానా వైద్యాధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ రెహమాన్ ,డెమో వి అశోక్ రెడ్డి , ఎజూలువరాజేశ్వర్ రెడ్డి మోహన్,అధికారులు పాల్గొన్నారు.

# చిల్కానగర్,బీరప్పగడ్డ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**-కమిషనర్ను కలిసి వినతిపత్రం సమర్పించిన బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్**



ఉప్పల్ జన సంఘర్షణ:
చిల్కానగర్,బీరప్పగడ్డ డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ కార్పొరేటర్,జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని తార్నాక హుడా కాంప్లెక్స్లోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. శాలువాతో సత్కరించి,రెండు డివిజన్లలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.ఈ సందర్భంగా గీతా ప్రవీణ్ మాట్లాడుతూ హైకోర్టు కాలనీ పరిధిలోని నాచారం చెరువు అభివృద్ధి కోసం బండారి లక్ష్మారెడ్డి 30 కోట్ల నిధులు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువు సుందరీకరణలో భాగంగా ముందుగా చెరువులోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి, గుర్రపు డెక్క తొలగింపు పనులను అత్యవసరంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గుర్రపు డెక్క కారణంగా దోమల పెరుగుదల అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో ఇప్పటికే డ్రైనేజీ పైప్లైన్ పనులు పూర్తైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్లైన్లకు నిధులు కేటాయించాలని కోరారు. స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో స్పష్టం చేశారు.ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించిన పనులు ఆలస్యం కాకుండా వెంటనే కార్యాచరణ రూపొందించాలని, అభివృద్ధి పనులపై సమయపాలనతో చర్యలు తీసుకోవాలని కమిషనర్ను కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని సూచించారు.వినతిపత్రంపై స్పందించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరలో అవసరమైన నిధుల కేటాయింపుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్,శ్యామ్,బాలు తదితరులు పాల్గొన్నారు.డివిజన్ల అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే తమ ప్రధాన లక్ష్యమని బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ స్పష్టం చేశారు.

# శ్రీశ్రీ సంత్ సేవలాల్ నీ ఆదర్శంగా తీసుకోవాలి

**-పోకలగూడెంలో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు**

**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న బంజారా నాయకులు**





చంద్రుగొండ జన సంఘర్షణ
చంద్రుగొండ మండలంలోని పోకలగూడెం గ్రామంలో శనివారం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు సందర్భంగా భోగ్ బండరో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటిగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని ఎడ్ల బండి పై పెట్టి గ్రామంలో ఊరేగింపు చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భోగ్ బండరో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గుగులోత్ బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలోతు భోజ్య నాయక్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ శ్రీ సంత సేవలాల్ మహారాజని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ జి రవిబాబు, వెంకట తండా సర్పంచ్ మాలోత్ పద్మ ,ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు మోహన్ నాయక్, గ్రామ నాయకులు భద్రు నాయక్, చందర్ నాయక్, గ్రామంలోని గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



# వావ్.. సింహా తేజ

-పిట్ట కొంచెం ఘనత ఘనం

-ఎల్లలు దాటిన యువ తేజం..

-ప్రపంచ వేధికపై ప్రతిభ చాటిన సింహా తేజ

-థాయిలాండ్లోని బ్యాంకాక్ యునైటెడ్ నేషన్స్లో గ్లోబల్ కాన్ఫరెన్స్

-ప్రాతినిధ్యం వహించి రికార్డు సృష్టించిన తెలంగాణ)లుగు విద్యార్థి

-కీసర పల్లవి ఇంటర్ నేషనల్ స్కూల్ నుండి బ్యాంకాక్ యూనిటైడ్ నేషన్స్కు పయనం

-ప్రపంచ కాన్ఫరెన్స్లో నాగారం వాసీ నయా రికార్డు

-సంతోషంలో సింహా తేజ తల్లిదండ్రులు ప్రహ్లాద్,కీర్తన దంపతులు











**హైదరాబాద్ జన సంఘర్షణ**

పిట్ట కొంచేం కుత ఘనం అంటే ఇదేనేమో.. మేధస్సు, జ్ఞానం, ప్రతిభ ఉంటే వారిని ఎవరు? అపలేరు సరికదా?... ఆ ప్రతిభాశీలురికి ఎక్కడ, ఎప్పుడైన సరే, యావత్ ప్రపంచం నలు ములల గర్వపడేలా, తన సత్తా(కు)ను నిరుపించుకోనే ఓ రోజు వస్తోంది. అప్పుడు వారి సహసం, ప్రతిభకు మెచ్చి, ప్రతి ఒక్కరు సలాం కొట్టాల్సిందే. తాజాగా.. పాఠశాల విద్యనభ్యసించే ఓ తెలంగాణ విద్యార్థి ప్రతిభ ఎల్లలు దాటింది. మేడ్చల్ జిల్లా, కీసర మండలం సత్యనారాయణ కాలనికి చేందిన జిడికంటి ప్రహ్లాద్, కీర్తన దంపతుల కుమారుడు సింహాతేజ.. బ్యాంకాక్లో జరిగిన యుఎన్ సమావేశంలో అరుదైన ఘనత సాదించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చేందిన రాయబారులు, మంత్రులు, విద్యావేత్తలు, పరిశోధకులు, విశ్వవిద్యాలయ మేధావులు, యువ ప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గోన్న ఈ ప్రతిష్టాత్మక గ్లోబల్ సమావేశంలో భారతదేశం నుంచి ప్రపంచ వేధికపై ప్రాతినిధ్యం వహించే అవకాశం ఈ యువ సృష్టికర్త.. మాస్టర్ సింహా తేజకు దక్కడం ఓ విశేషం. ఇటివల థాయిలాండ్లోని బ్యాంకాక్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్లో మన(ఈ) తెలంగాణ విద్యార్థి అక్కడి (వేధిక) సంఘానికి ప్రాతినిధ్యం వహించి రికార్డు సృష్టించారు. అయితే, ఈ బాల మేధావి కీసర మండలం, పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు.అత్యంత పిన్న వయస్సులో ఈ బుడతడు విశ్వ వేధికను పంచుకోవడం, భారత్కు గర్వకారణమైన రోజుగా పలువురు మేధావులు కోనియాడారు. ప్రపంచ డెలిగెట్స్తో పాటు అత్యంత జ్ఞానవంతమైన యువతతో కలిసి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్య యొక్క భవిష్యత్తుపై సింహతేజ ప్రసంగించిన ఈ భారీ వేధిక.. ఆవిష్కరణ, సమానత్వం, భవిష్యత్తు(కు)పై సిద్ధంగా ఉన్న అభ్యాస వ్యవస్థలపై అర్థవంతమైన చర్చలను ప్రోత్సహిస్తుందని కాన్ఫరేన్స్లో సింహా తేజ చెప్పిన మాటలు... కలలుగనే నేటి యువత(కు) అక్షర సత్యాలుగా కనిపించాయట.. అ స్పీచ్ను విన్న వారంతా ఒక్కసారిగా తమ ఉజ్వల భవిష్యత్తై ఊహల్లో పడ్డారట.. విద్యా పరివర్తనలో మార్పులను రూపొందించడంలో పెరుగుతున్న యువత స్వరాన్ని, సింహ తేజ తన ప్రతిభను ద్వారా ప్రతిబింబింపచేశారని పలువురు డెలిగెట్స్ కోనియా(డారు)డటం విశేషం. ఇది అతని భవిష్యత్ విద్యా ప్రయాణాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని ప్రౌడ్ పేరెంట్స్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ .. మాస్టర్ సింహా తేజకు దక్కిన ఈ అద్భుతమైన విజయాన్ని అభినందించారు. సింహ తేజ, రిహా, గాంధీలు సాదించిన ఈ ఘనతపై.. తొటి విద్యార్థులను సైతం ప్రపంచవ్యాప్తంగా ఆలోచించి, స్థిరమైన భవిష్యత్తు కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించమని ప్రోత్సహిస్తదని, కో ఆర్డినేటర్ చింతలూరీ అన్నపూర్ణ, పల్లవి ఇంటర్ నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చన్నప్రగడ శ్రీలత నేతృత్వంలో విజయవంతంగా జరిగిందని వారు అభిప్రాయపడ్డారు.ఈ నేషనల్ యునైటెడ్ కాన్ఫరెన్స్లో యావత్ దేశం, తెలంగాణ రాష్ట్రం, గర్వపడేలా చేసిన సింహా తేజ రికార్డ్తో.. తల్లిదండ్రులు ప్రహ్లాద్, కీర్తన దంపతులు ఉప్పొంగిపోయారు. ఈ సందర్భంగా తెలంగాణకు చేందిన పలువురు ప్రముఖులతో పాటు, పాఠశాల యాజమాన్యం, బంధువులు, నాగారం డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు. రికార్డు సాధించిన బుడతడిని పలువురు ప్రముఖులు దీవించారు. భవిష్యత్లో సింహా తేజ మరింత ఉన్నత శిఖరాలకి ఎదగాలని తెలంగాణ మలిధశ ఉద్యమకారుడు, సీనీయర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారులు కోడికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు వెంగళా మధుసుధన్ తదితరులు అకాక్షించారు.

**'సింహ తేజ'ను అభినందించిన**

ఈ సందర్భంగా 'సింహ తేజ'ను "సీనీయర్ పాత్రికేయుల బృందం అభినందించింది. ఈ సందర్భంగా "మా ప్రతినిధి"తో ఆయన మాట్లాడుతూ.. తనకు దక్కిన ఈ గొప్ప అవకాశం, సత్కారం, పలువురి నుంచి వస్తున్న అభినందనలపై 'సింహ తేజ' ఇది తన జీవితంలో మరచిపోలేనని అత్యంత అరుదైన ఘటనగా ఆయన అభివర్ణించారు. ఈ రికార్డులు తనను జీవితంలో మరింత శిఖరాలకు చేరేలా ఉపయోగపడతాయని ఆయన పేర్కోన్నారు.

# అంధ పాఠశాల విద్యార్థులకు విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థుల లక్ష రూపాయల విరాళం

**హనుమకొండ జన సంఘర్షణ:**
హైదరాబాదులోని సోచ్ ఫౌండేషన్ వారి ఇట్రాడో అంధుల పాఠశాలకు విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థులు 1లక్ష 13 వేల విరాళాన్ని అందజేసినట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోచ్ ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడుతూ తాము గుడ్డి వారిని ఆదరిస్తూ తమ పాఠశాలలో వారికి బ్రెయిలీలిపి తో పాటు, క్రీడలు, సంగీతం, నాట్య కళల్లో శిక్షణను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించడం గర్వనీయం. సమాజంలో పుట్టు గుడ్డి వారు నిరాదరణకు గురవడం మనకు తెలిసిందే. కానీ వారిని మేము అక్కున చేర్చుకుని వారిలోని నైపుణ్యతను గుర్తించి వారికి తర్ఫీదును ఇస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం దేవుడిచ్చిన అందమైన కళ్ళు గలవారు ముఖ్యంగా విద్యార్థులు చూపును కోల్పోవడం బాధ కలిగిస్తుందని వారు ఆవేదనను వెలుబుచ్చారు. దీనికి కారణం తల్లిదండ్రులు తమ ఐదుసంవత్సరాల లోపు చిన్నారులకు భోజనం చేస్తున్న సమయంలో ఏడవకుండా మొబైల్ ఫోన్లను అత్యధికంగా ఇవ్వడమే ప్రధాన కారణంగా తెలియజేశారు. తర్వాత 6 నుండి 15 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆటపాటల్లో కాకుండా ఫోన్లతో కాలక్షేపం చేయడం, వాటిలో క్రీడలు తదితర విషయాలను అధికంగా చూడడం ప్రధాన కారణంగా తెలియజేశారు. ఫోన్లను, టీవీలను పిల్లలు అధికంగా చూడడం వలన కంటిలోని రెటీనా క్షీణించి, కంటి నరాలు పాడయిపోయి శాశ్వతంగా చూపు కోల్పోతుందని వారు తెలిపారు. బంగారు భవిష్యత్తు గల ఇలాంటి పిల్లలు తమ అంధ పాఠశాలలో చేరడం బాధ కలిగిస్తుందని తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ఇలాంటి విషయాలు పిల్లలకు తెలియజేయాల్సిన తల్లిదండ్రులు సైతం మొబైల్ ఫోన్లతో గడపడం బాధాకరమని వారు తెలిపారు. దయచేసి తల్లిదండ్రులు తమ పిల్లలకు మొబైల్ ఫోన్ల నుంచి దూరంగా ఉంచాలని, వారితో స్నేహం చేస్తూ ఫోన్, టీవీ తదితర వాటిని అధికంగా చూడడం వలన జరుగు నష్టాలను వివరించి చెప్పాలని, తద్వారా మన అందమైన కళ్ళను కాపాడుకోవచ్చని, కళ్ళు లేనిదే ఈ అందమైన సృష్టిని మనం వీక్షించలేమని, తమ తల్లిదండ్రులను సైతం కళ్ళతో చూడలేరని తమ తమ పిల్లలకు విడమరిచి చెప్పాలని విన్నవించుకున్నారు. ఆ భగవంతుడు కల్పించిన చూపును కాపాడుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లను అత్యధికంగా వాడడం వల్ల రేడియేషన్ తో మెదడులోని నరాలు క్షీణించి, మెదడు మొద్దు బారిపోయి అనేకమంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని వారు తెలియజేశారు. తమ పాఠశాలకు విజ్ డమ్ విద్యార్థులు 1 లక్ష 13 వేల విరాళాన్ని సేకరించి అందించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పాఠశాల విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, సేవా గుణం లో సైతం ముందు ఉండడం గర్వనీయమని వారు తెలియజేశారు. ప్రతీ సంవత్సరం మా అంధ పాఠశాలకు విరాళాలు అందిస్తూ మీలాంటి వారికి మేమున్నామనే భరోసాను కల్పించడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఆ భగవంతుడు పిల్లలకి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, బంగారు భవిష్యత్తునిస్తున్న ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి ఎల్లవేళలా ఆయురారోగ్యాలు కల్పించాలని ఇట్రాడో పాఠశాల విద్యార్థులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇంచార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తాన, వీరభద్రయ్య, హారిక, ప్రశాంత్ కుమార్, రియాజ్, రాజేష్, పృధ్వి, అరుణ, యాస్మిన్ లతోపాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవునూర్ ఇనుపరాతి గట్లలో వనదర్శిని

-ట్రెక్కింగ్,ఫారెస్ట్ బాతింగ్తో విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం


**ధర్మసాగర్ జన సంఘర్షణ:**
ప్రకృతిని పరిచయం చేస్తూ పర్యావరణంపై చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన వనదర్శిని కార్యక్రమం దేవునూర్ ఇనుపరాతి గట్ల వద్ద ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.జెడ్పిహెచ్ఎస్ బాలుర ధర్మసాగర్,ఎంపిపిఎస్ ధర్మసాగర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రకృతి ఒడిలో అరుదైన అనుభూతిని పొందారు.ట్రెక్కింగ్, ఫారెస్ట్ వాక్, ఫారెస్ట్ బాతింగ్, పక్షి వీక్షణ, జీవ వైవిధ్య పరిశీలన వంటి అనుభవాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తరగతి గదులకు అతీతంగా నేర్చుకునే అవకాశం కల్పించారు. అడవిలో నడుస్తూ వృక్షజాలం, పక్షులు, చిన్న జీవులను గమనిస్తూ ప్రకృతితో అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ఉపసమితి కన్వీనర్




ధర్మప్రకాశ్ మాట్లాడుతూ అటవీ సంపద పర్యావరణ సమతుల్యతకు ఎంత ముఖ్యమో వివరించారు. వనాలు వాతావరణ నియంత్రణలో, జల వనరుల సంరక్షణలో, వన్యప్రాణి రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మానవ ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రకృతి అందించే మద్దతును స్పష్టంగా వివరించారు.విద్యార్థులకు "ఫారెస్ట్ బాతింగ్" భావనను పరిచయం చేస్తూ అడవి ప్రశాంతతను మనసారా ఆస్వాదించాలన్నారు.ప్రకృతిలో గడిపే సమయం ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. పక్షి వీక్షణ కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని స్థానిక పక్షుల స్వరాలను ఆస్వాదించారు. జీవ వైవిధ్య పరిశీలనలో వృక్షాలు, మొక్కలు, పురుగులు గుర్తించడంలో మార్గదర్శనం అందించారు.అటవీ శాఖ బీట్ అధికారులు రతన్ లాల్, అశోక్, రాణి చెక్ డ్యామ్ల ప్రాముఖ్యత, అటవీ సంరక్షణ అవసరం, వన్యప్రాణి రక్షణపై వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేశారు. శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం, పండ్లు అందించగా వారు ఆనందంగా స్వీకరించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, సుధీర్ రెడ్డి, భాగ్యలక్ష్మి విద్యార్థులను ప్రోత్సహిస్తూ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించారు.వనదర్శిని కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పర్యావరణ సున్నితత్వం, ప్రకృతిపట్ల గౌరవాన్ని పెంపొందించడంలో కీలకంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు పర్యావరణ బాధ్యతను నేర్పుతూ స్థిరమైన జీవన విధానానికి దారి చూపుతున్నాయి.

విలేకరులు కావలేను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు
జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల
వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సహం కలిగిన యువతి,
యువకులు కావలేను. సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును



వివరాలకు సంప్రదించండి 63050 26524

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co